క్లుప్తంగా

ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదుచేసుకోవాలి



సదస్సులో మాట్లాడుతున్న రత్నప్రసాద్

ఏలూరు (టూటౌన్): ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా వ్యాప్తంగా ఉన్న భవన నిర్మాణ, అసంఘటిత రంగ కార్మికులు తప్పనిసరిగా తమ వివరాలను ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు చేసుకోవాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె.రత్నప్రసాద్ సూచించారు. గురువారం జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవనంలో ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులో రత్న ప్రసాద్ మాట్లాడుతూ కార్మికులందరూ ఈ-శ్రమ్ పోర్టల్‌లో నమోదు కావడంతోపాటు తప్పనిసరిగా గుర్తింపు కార్డులు పొందాలన్నారు. అప్పుడే సంక్షేమ పథకాలకు అర్హులని చెప్పారు. న్యాయ సలహాల కోసం జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని అన్నారు. అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ వేణుగోపాలరావు, ప్యానల్ లాయర్ కూనా కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

డ్యూటీ సర్టిఫికెట్లు కోరుతూ వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్ : ఏప్రిల్ నెలలో ఎన్నికల సంఘం చేపట్టిన జనరల్ ఎన్నికల డ్యూటి నిర్వహించిన ఉపాధ్యాయులకు డ్యూటీ సర్టిఫికెట్లు అందజేయాలని ఉపాధ్యాయ నాయకులు కోరారు. గురువారం యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఈడే శివశంకర్‌రావు, టౌన్ అధ్యక్షురాలు షేక్ పర్వీన్, ప్రధాన కార్యదర్శి జొన్నకూటి రాజారావు, కోశాధికారి కోరాడ కిరణ్‌కుమార్, జిల్లా కౌన్సిలర్ కేవీ అప్పారావు, మీడియా కన్వీనర్ జక్రియా ఏలూరు అర్బన్ తహసీల్దార్ శేషగిరి కలిసి వినతిపత్రం అందించారు. ఎన్నికల డ్యూటి సర్టిఫికెట్లు అందక పలువురు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక డీ4 సెక్షన్ పరిధిలో చెట్ల కొమ్మల తొలగింపు, లైన్ల వార్షిక మరమ్మతుల నిమిత్తం శుక్రవారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ కేఎం అంబేద్కర్ తెలిపారు. కొమడవోలు రోడ్డు, సాయినగర్, హమాలీ కాలనీ, దుర్గ గ్రాండ్ సిటీ, ఆండాళ్ళమ్మ తోట, రామ్ నగర్, మారుతీ నగర్, మస్తాన్ మన్యం కాలనీ, నాగేంద్ర కాలనీ, శ్రీరాం నగర్ కాలనీ, శాస్త్రి కాలనీ, చెంచుల కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపేస్తామని పేర్కొన్నారు.

ఆలయాలపై పట్టు కోసం పాకులాట

- కాబోయే ట్రస్టీలు తామేనంటూ ప్రచారం
- ఆలయాల్లో కూటమి చోటా నేతల తిష్ట
- ఈఓలు, సిబ్బందిపై పెత్తనం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): గత ఎన్నికల్లో తమ కూటమి పార్టీలు అధికారంలోకి రావడంతో ఆయా పార్టీల చోటా నాయకుల ఆగడాలకు అడ్డే లేకపోతోంది. ప్రభుత్వ శాఖల కార్యాలయాల్లోనూ పట్టు సాధించేందుకు పాకులాడుతున్నారు. ఇప్పటికే ప్రభుత్వ ఆసుపత్రులు, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల్లో వారు అధికారులను ఆదేశించే స్థాయిలో రాజకీయాలు నెరుపుతున్నారు. తమ మాట వినని అధికారులపై ఎమ్మెల్యేలకు చాడీలు చెప్పి వారిని ఇబ్బంది పెట్టడానికి చూస్తున్నారు. ఇప్పుడు వారి దృష్టి ఆలయాలపై పడింది. భక్తులు ఎక్కువగా వచ్చే ఆలయాలపై పట్టు కోసం పాకులాడుతున్నారు.

పదవులకు భరోసా

ఆయా పార్టీల చోటా నేతలు మండల స్థాయిలో ఏదో ఒక నామినేటెడ్ పదవి వస్తుందన్న ఆశతో ఉన్నారు. ఐతే పార్టీ అనుబంధ విభాగాల పదవులు, లేదంటే ఏఎంసీలు, ఆలయాల ట్రస్ట్ బోర్డుల్లోనైనా తమకు పదవి ఇవ్వాలని ఇప్పటికే స్థానిక ఎమ్మెల్యేకు చెప్పుకుని ఉన్నారు. వారిలో కొందరికి కోరిన పదవులకు భరోసా లభ్యమైనట్టు సమాచారం. ఆయా పదవులకు భరోసా వచ్చిన చోటా నాయకులు తాము కోరిన ఆలయాలపై వాలిపోతున్నారు. కాబోయే ట్రస్టీలు, ట్రస్ట్ బోర్డు చైర్మన్లు తామేనని చెప్పుకుంటూ ఆయా ఆలయాల్లో తిష్ట వేస్తున్నారు. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే లేదా అధిక ఆదాయం వచ్చే ఆలయాలపై వారి దృష్టిపడింది. వారికి ఎటువంటి పదవీ లేకపోయినా ఆయా ఆలయాలపై తమ ఆధిపత్యం ప్రదర్శించడానికి ప్రయత్నాలు ప్రారంభించారు.

చెప్పినట్టు వినాల్సిందే

ఆయా ఆలయాలకు తామే ట్రస్ట్ బోర్డు చైర్మన్లు అవుతామనే అతి విశ్వాసంతో వారు అక్కడి కార్యనిర్వహణాధికారులు, ఆలయ సిబ్బందిపై పెత్తనం చూపుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. అర్చకులపైనా వారు అజమాయిషీ చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెబుతున్నారు. ఆలయంలో తాము చెప్పినట్టు వినకపోతే ఎమ్మెల్యేతో చెప్పి బదిలీ చేయించడమో, క్రమశిక్షణ చర్యలు తీసుకోవడమో చేస్తామని హెచ్చరిస్తున్నారని వాపోతున్నారు.

ఆదాయం బట్టి వర్గీకరణ

దేవదాయ శాఖ పరిధిలోని ఆలయాలను వాటికి వచ్చే ఆదాయాన్ని బట్టి 6ఏ, 6బీ, 6సీలుగా విభజించారు. రూ.25 లక్షల నుంచి రూ.కోటి ఆదాయం వచ్చే ఆలయాలను 6ఏగా, రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షల్లోపు ఆదాయం వచ్చే ఆలయాలను 6బీగా, రూ.50 వేల నుంచి రూ.5 లక్షల్లోపు ఆదాయం వచ్చే ఆలయాలను 6సీగా వర్గీకరించారు. రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానం, మెయిన్ బజారులోని రంగ్రీజుల మఠం, కెనాల్ రోడ్డులోని గాంధీ ఆంధ్ర జాతీయ మహా విద్యాలయాలు 6ఏ సంస్థల జాబితాలో ఉన్నాయి. సుమారు 15 ఆలయాలు 6బీ జాబితాలో ఉన్నాయి. వీటిపై కూటమి చోటా నేతల కన్ను పడింది.

చోటా నేతల జోక్యంతో గందరగోళం

కొందరు కూటమి చోటా నాయకులు తాము ట్రస్టీలుగా పదవి ఆశించే ఆలయాల్లో చేరి ఇప్పటికే పూజా వ్యవహారాల్లోనూ, భక్తులకు కల్పించే సౌకర్యాల్లోనూ జోక్యం చేసుకుంటూ గందరగోళం సృష్టిస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. ప్రసాదాల పంపిణీలోనూ జోక్యం చేసుకుని తాము చెప్పిన దుకాణాల్లోనే నిత్యావసర సరుకులు, పూజా సామగ్రి, పూలదండలు, పుష్పాలు కొనాలని ఒత్తిడి చేస్తున్నట్టు చెబుతున్నారు. దీంతో గతంలో కంటే అధికమొత్తంలో చెల్లింపులు చేయాల్సి వస్తోందని, సరుకుల్లో నాణ్యత కొరవడుతుందని సిబ్బంది వాపోతున్నారు. వీరికి పదవి వస్తే పరిస్థితి ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు.



పత్తేబాదలో నాలుగు గుడుల సెంటర్‌లోని కనకదుర్గమ్మ ఆలయం

ఆ ఆలయాలపైనే దృష్టి

ఇటీవల స్థానిక రామచంద్రరావు పేట వేంకటేశ్వర స్వామి దేవస్థానంలో స్వామి వారి త్రిసప్తాహ బ్రహ్మోత్సవాలు నిర్వహించారు. ఈ ఉత్సవాల నిర్వహణకు ముందు నుంచి ఒక టీడీపీ చోటా నాయకుడు మితిమీరిన జోక్యం చేసుకున్నాడని ఆ ఆలయానికి నిత్యం వచ్చే భక్తులు, స్వామివారి ఉత్సవాల్లో సేవలు అందించే బృందాల సభ్యులు చర్చించుకుంటున్నారు. దీంతో పాటు నగరంలో ప్రసిద్ధి చెందిన పత్తేబాద చౌడేశ్వరి రామలింగేశ్వర స్వామి దేవస్థానం, కనకదుర్గమ్మ ఆలయం, అగ్రహారంలోని భూ నీళా సమేత జనార్దన స్వామి, పవర్‌పేటలోని కాశీ అన్నపూర్ణ సమేత విశ్వేశ్వర స్వామి, కొత్తపేట నూకాలమ్మ, దక్షిణపు వీధి శ్రీమత్ మార్కండేయ ఓంకార విశ్వేశ్వర స్వామి దేవస్థానం వంటి పలు ఆలయాలకు ఆదాయం ఎక్కువగా రావడం, వార్షిక ప్రత్యేక, విశేష పూజలు నిర్వహించే ఆలయాలపైనా చోటా నాయకులు దృష్టి సారించారు.

నోటిఫికేషన్ విడుదల కాలేదు

ఏలూరు నియోజకవర్గంలోని ఆలయాల ట్రస్ట్ బోర్డుల పదవీ కాలం గతంలోనే ముగిసింది. ప్రస్తుతం ట్రస్ట్ బోర్డుల నియామకానికి దేవదాయ శాఖ నుంచి నోటిఫికేషన్ విడుదల కాలేదు. నోటిఫికేషన్ విడుదలైతే ట్రస్టీల నియామక ప్రక్రియ ప్రారంభమౌతుంది.

– దేవదాయ శాఖ ఏలూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్

వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ అధ్యక్షుడిగా తంబి



జయప్రకాష్‌ను కలిసిన ప్రత్తిపాటి తంబి

ఏలూరు (టూటౌన్): వైఎస్సార్ సీపీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఏలూరు నియోజకవర్గ లీగల్ సెల్ అధ్యక్షుడిగా నియమితుడైన ప్రతిపాటి తంబి ఆ పార్టీ ఏలూరు నియోజకవర్గ ఇన్‌చార్జి మామిళ్లపల్లి జయప్రకాష్ (జేపీ)ని గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. తనను నియమించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాస్, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్, జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు నెరుసు చిరంజీవి పాల్గొన్నారు.

బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థ ఆధ్వర్యంలో జిల్లాలోని గ్రామీణ నిరుద్యోగ యువతులకు బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ ఇస్తున్నట్టు ఆ సంస్థ డైరెక్టర్ కె.శిఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 27 నుంచి 30 రోజుల పాటు కొనసాగే ఈ శిక్షణకు 10వ తరగతి, ఆపైన విద్యార్హత గల 19 నుంచి 45 సంవత్సరాల మధ్య వయసున్న యువతులు అర్హులని వివరించారు. పూర్తి వివరాలకు ఫోన్ నెంబర్లు 95027 23561, 90140 40780, 95330 79471లో సంప్రదించాలని తెలిపారు.

పరిశ్రమల ఏర్పాటుకు సహకారం



మాట్లాడుతున్న ట్రైనింగ్ హెడ్ మురళీకృష్ణ

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమల ఏర్పాటుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల ద్వారా ఆర్థిక సహకారం అందిస్తున్నట్టు ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీస్ సంస్థ ట్రైనింగ్ హెడ్ కె.మురళీ కృష్ణ తెలిపారు. గురువారం స్థానిక సీఆర్‌ఆర్ ఇంజినీరింగ్ కళాశాలలో ఈసీఈ విభాగం ఆధ్వర్యంలో ఎంటర్ ప్రెన్యూర్‌షిప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న మురళీకృష్ణ మాట్లాడుతూ ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీ సెంటర్ ద్వారా ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఇంటర్న్‌షిప్, స్కిల్ డెవలప్‌మెంట్, స్టార్టప్ కంపెనీలకు చేయూత అందిస్తున్నామన్నారు. ఐడియా ప్రజంటేషన్స్, ప్రాడక్ట్ డెవలప్‌మెంట్, పారిశ్రామికవేత్తగా కెరీర్ అభివృద్ధికి తమ సంస్థ ద్వారా అందించే ఆర్థిక, సాంకేతిక సహాయం తదితర అంశాలపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ద్వారా విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఎంఎస్‌ఎంఈ టెక్నాలజీస్ సంస్థ డిప్యూటీ డైరెక్టర్ కాలేబు, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పి.సుబ్రహ్మణ్యేశ్వర రావు, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి జితేంద్ర, కళాశాల ప్రిన్సిపాల్ కె.సాంబశివరావు, ఈసీఈ హెడ్ తేజోమూర్తి, కోఆర్డినేటర్ ఎం రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేతాజీకి ఘన నివాళి



పార్టీ కార్యాలయంలో నేతాజీ చిత్ర పటం వద్ద నివాళులర్పిస్తున్న జయప్రకాష్, నాయకులు

ఏలూరు టౌన్ : దేశానికి స్వాతంత్ర్య సముపార్జనలో ప్రాణాలను సైతం లెక్కచేయకుండా త్యాగాలు చేసిన మహానేతల స్ఫూర్తితో అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని వైఎస్సార్ సీపీ ఏలూరు సమన్వయకర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. ఏలూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి సందర్భంగా గురువారం నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జేపీ మాట్లాడుతూ దేశానికి స్వాతంత్ర్యం సాధించటంలో సమరయోధులు, అజాద్ హింద్ ఫౌజ్ వ్యవస్థాపకులు నేతాజీ కీలక పాత్ర పోషించారని గుర్తుచేశారు. మహనీయుల ఆశయాలతో దేశ సమైక్యతను పరిరక్షించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ ఏలూరు నగర అధ్యక్షుడు గుడిదేశి శ్రీనివాసరావు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్‌బాబు, బీసీ సెల్ జిల్లా అధ్యక్షుడు నెరుసు చిరంజీవి, జిల్లా ట్రేడ్ యూనియన్ అధ్యక్షులు పల్లి శ్రీనివాస్, జిల్లా జాయింట్ సెక్రటరీ బత్తిన మస్తాన్‌రావు, రాష్ట్ర వాణిజ్య విభాగం సెక్రటరీ బాచి, మాజీ ఎస్సీ, ఎస్టీ సెల్ మానిటరింగ్ సభ్యులు మట్టా రాజు, లీగల్ సెల్ ఏలూరు అధ్యక్షులు ప్రత్తిపాటి తంబి, గ్రీవెన్స్ సెల్ నగర అధ్యక్షుడు మద్దాల ఫణి, మైనార్టీ నాయకులు గాజుల బాజీ, కల్చరల్ వింగ్ నగర అధ్యక్షులు మేతర సురేష్‌బాబు, డాక్టర్స్ వింగ్ అధ్యక్షుడు కొవ్వాడ దుర్గారావు, ఎస్సీ నాయకులు బండ్లమూడి సునీల్‌కుమార్ తదితరులు ఉన్నారు.

అమిత్ షా వ్యాఖ్యలు అవమానకరం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట) : అమిత్ షా చేసిన వ్యాఖ్యలు బీఆర్ అంబేడ్కర్‌ను, భారత రాజ్యాంగాన్ని అవమానించడమేనని ఏఐసీసీ జాయింట్ సెక్రటరీ, ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ రాజకీయ వ్యవహారాల ఇన్‌చార్జి డాక్టర్ పాలక్ వర్మ అన్నారు. ఏలూరు జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో గురువారం జై బాపూజీ, జై భీమ్, జై సమవిధాన్ నినాదంతో బీఆర్ అంబేడ్కర్ గౌరవార్థం పాదయాత్ర నిర్వహించారు. అమిత్ షా క్షమాపణలు చెప్పి, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు రాజనాల రామ్మోహనరావు, పీసీసీ జనరల్ సెక్రటరీలు పాల్గొన్నారు.

రహదారి భద్రత అవగాహనపై వాకథాన్



వాకథాన్‌లో పాల్గొన్న ప్రజా ప్రతినిధులు, అధికారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): జాతీయ రహదారి భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం స్థానిక ఫైర్ స్టేషన్ సెంటర్ వద్ద ఇన్‌చార్జి ఉప రవాణా కమిషనరు కేఎస్‌ఎంవీ కృష్ణారావు ఆధ్వర్యంలో జిల్లా రవాణా శాఖ అధికారులు వాకథాన్ కార్యక్రమం నిర్వహించారు. రహదారి భద్రతా నియమాలను ప్రజలకు వివరిస్తూ జూట్ మిల్ కూడలి వరకు వాకథాన్ కొనసాగించారు. ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపరాదని, రాష్ డ్రైవింగ్ వద్దని, ఇద్దరికి మించి ద్విచక్ర వాహనంపై ప్రయాణించవద్దని కోరారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బడేటి చంటి, చింతమనేని ప్రభాకర్, మేయర్ షేక్ నూర్జహాన్, కో ఆప్షన్ సభ్యుడు పెదబాబు, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూపు

దెందులూరు: రాష్ట్రంలో లక్షలాది మంది విద్యావంతులు నిరుద్యోగ భృతి కోసం ఎదురుచూస్తున్నారని వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి కట్టా ఏసుబాబు, మండల ఉపాధ్యక్షులు తలారి రామకృష్ణ, బొర్రా మురళి అన్నారు. గురువారం దెందులూరులో వారు మాట్లాడుతూ నిరుద్యోగ యువత సంగతి గాలికి వదిలేసి చంద్రబాబు, లోకేష్, పవన్ కళ్యాణ్ మౌనంగా ఉండటం కూటమి ప్రభుత్వ స్వభావాన్ని తెలియజేసిందన్నారు. సూపర్ సిక్స్‌కు ఖజానాలో నిధులు లేవని అసెంబ్లీలో ప్రకటించిన చంద్రబాబు దావోస్ పర్యటనకు రూ.కోట్లు వెచ్చించి ప్రచారం చేయడం వెనుక ఆంతర్యం ఏమిటని ప్రశ్నించారు. మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతిపై కూటమి నాయకులు స్పందించాలని డిమాండ్ చేశారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంసైతం గాలికి వదిలేశారని వివరించారు. ప్రతి జనవరి నెలలో జాబ్ క్యాలెండర్ రిలీజ్ చేస్తామన్న విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ స్పందించాలని, కూటమి ప్రభుత్వం మెగా డీఎస్సీ, నిరుద్యోగ భృతి ఇవ్వాలని కోరారు.

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు అవసరం



అపుస్మా నాయకులతో వివిధ క్రీడా పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థుల శారీరక ఆరోగ్యాన్ని పరిరక్షించడానికి క్రీడల అవసరం ఉందని ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్ (అపుస్మా) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎంబీఎస్ శర్మ అన్నారు. అపుస్మా ఏలూరు జోన్ ఆధ్వర్యంలో స్థానిక అల్లూరి సీతారామరాజు స్టేడియంలో బుధవారం ప్రారంభమైన క్రీడా పోటీలు గురువారం ముగిశాయి. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న శర్మ మాట్లాడుతూ విద్యార్థులు చదువులోనే కాక క్రీడల్లోనూ ప్రతిభా పాటవాలు ప్రదర్శించాలని సూచించారు. అపుస్మా ఏలూరు జోన్ అధ్యక్షుడు కె.వెంకటేశ్వర రావు మాట్లాడుతూ ప్రైవేట్ పాఠశాల విద్యార్థులు సైతం క్రీడల్లో ఉజ్వల భవిత అందించాలనే లక్ష్యంతో క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీల్లో ఏలూరు జోన్ పరిధిలో దాదాపు 2 వేల మంది విద్యార్థులు పాల్గొన్నారని, విజేతలకు త్వరలోనే బహుమతులు అందిస్తామని తెలిపారు. ఈ పోటీల్లో నగరానికి చెందిన శ్రీ సూర్య ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు అత్యధిక క్రీడాంశాల్లో, దాదాపు అన్ని విభాగాల్లో విజేతలుగా నిలిచి చాంపియన్‌షిప్ సాధించారు. కార్యక్రమంలో అపుస్మా ప్రతినిధులు కె.చంద్ర శేఖర్, కడియాల విజయలక్ష్మి, ఎస్‌ఆర్‌కే ప్రసాద్, కె.వినోద్, జి.రవి శంకర్, వై.రాణా ప్రతాప్, ఎం శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ జెండాల పంపిణీ



జాతీయ జెండాలు పంపిణీ చేస్తున్న అతిథులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నేటి యువతకు నేతాజీ సుభాస్ చంద్రబోస్ ఆదర్శప్రాయుడని ఘంటసాల స్వరపీఠం వ్యవస్థాపకుడు, జాతీయ పతాక ప్రచారకర్త ఎస్‌కే సుభాని అన్నారు. స్థానిక సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హాలులో గురువారం నేతాజీ జయంతి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గణతంత్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని తయారు చేసిన జాతీయ పతాకాలను పంపిణీ చేశారు. తొలుత నేతాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు వడ్లపట్ల నారాయణ రావు, దేవినేని భాస్కర రావు, ఘంటసాల స్వర పీఠం ప్రతినిధులు వై. అర్జున రావు, మేడికొండ పద్మజ తదితరులు పాల్గొన్నారు.

దంత పరిరక్షణపై అవగాహన అవసరం



విద్యార్థులకు పేస్టులు పంపిణీ చేసిన ప్రతినిధులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): విద్యార్థి దశలోనే ప్రతి ఒక్కరూ దంత పరిరక్షణపై అవగాహన కలిగి ఉండాలని దుగ్గిరాల సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల వైద్యులు అన్నారు. స్థానిక ఇందిరా కాలనీలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో నోటి పరిశుభ్రత అవగాహన, ఉచిత దంత వైద్య శిబిరాన్ని సెయింట్ జోసెఫ్ దంత వైద్య కళాశాల ప్రజా దంత ఆరోగ్య వైద్య విభాగం ఆధ్వర్యంలో గురువారం మెగా క్యాంపు నిర్వహించారు. పాఠశాలలోని 130 మంది విద్యార్థులకు వైద్యులు ఎం పవన సంధ్య, జి.ఉదయలక్ష్మి ప్రశాంత్ తదితరులు దంత పరీక్షలు నిర్వహించారు. దంతాలను ఎలా పరిశుభ్రంగా ఉంచుకోవాలో నమూనాలతో ప్రదర్శన చేసి విద్యార్థులతో కూడా డెమో నిర్వహించారు. దంతాలు పరిశుభ్రంగా ఉంచుకోకపోతే జరిగే నష్టాలను వివరించారు. మాదేపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుంకర వెంకటలక్ష్మి చేతులు మీదుగా విద్యార్థులకు పేస్టులను పంపిణీ చేశారు. ఈ శిబిరాన్ని ఫాదర్ జి.మోజస్, ప్రిన్సిపాల్ ఎస్ సెల్వరాజు ప్రారంభించారు. ప్రధానోపాధ్యాయులు టి.శ్రీనివాసరావు, సాంఘిక శాస్త్ర ఉపాధ్యాయులు గుగ్గులోతు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

మంత్రి వేడుకకు క్యాడర్ కరువు



మంత్రి నారా లోకేష్ పుట్టినరోజు సందర్భంగా ఏలూరు ఫైర్ స్టేషన్ సెంటర్‌లో ఎన్టీఆర్ విగ్రహం వద్ద గురువారం ఏర్పాటుచేసిన వేడుక అభాసుపాలైంది. కార్యక్రమానికి ఎమ్మెల్యే, మేయర్ ముఖ్య అతిథులుగా హాజరుకాగా, ఆ సమయానికి వైఎస్సార్ సీపీ నుంచి ఫిరాయించిన కార్పొరేటర్లు, నాయకులు తప్ప టీడీపీ కేడర్ పెద్దగా కనిపించలేదు. దీంతో నగరంలోని ప్రైవేటు కళాశాల విద్యార్థులను అక్కడికి రప్పించారు. తీరా అక్కడికి వచ్చిన విద్యార్థులకు అది లోకేష్ పుట్టినరోజు వేడుకని తెలియడంతో వెనుదిరిగారు. దీంతో టీడీపీ యువ నాయకుడు ఒకరు విద్యార్థులను ఆపే ప్రయత్నం చేస్తున్న దృశ్యమిది.

– సాక్షి ఫొటో గ్రాఫర్, ఏలూరు

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	36
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	41
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	13
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	31

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	27
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	32
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	28
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	24
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	22
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	33
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	36
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34
ఏలూరు-బీహెచ్‌ఈఎల్	22.30	98502	00

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	16	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	16	చిక్కుడు కాయలు	48
వంకాయలు (కాంతులు)	34	బీన్సచిక్కుడు	70
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	44
బెండకాయలు	40	ములక్కాడలు	10, 15
పచ్చిమిర్చి	36	కంద	68
కాకర కాయలు	30	బీట్‌రూట్	36
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	44	ఫ్రెంచ్‌బీన్స్	72
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	36	కొత్తిమీర (కట్ట)	15
దొండకాయలు	30	పాలకూర	10
బంగాళదుంపలు	32	చుక్కకూర	10
ఉల్లిపాయలు	40	తోటకూర	10
గోరుచిక్కుడు	28	గోంగూర	07-10
దోసకాయలు	28	పుదీనా	05
ఆనబకాయ (1)	20-25	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	44